తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 | సంచిక: 38 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: తెలంగాణ | సోమవారం 9-09-2023 | వెల: 5/రూ -



# మళ్లీ 'మున్నేరు' ముంపు!

**వణికిపోతున్న మున్నేరు వరద బాధితులు**

**పరీవాహక ప్రాంతాలను వదలని భారీ వర్షాలు.. ఉప్పొంగి**

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికార యంత్రాంగం

ఇంకొన్ని రోజులు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలంటూ హెచ్చరికలు

ఈనెల 1న విరుచుకుపడిన వరదతో పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో విధ్వంసం

ఉన్నదంతా ఊడ్చుకుపోవడంతో కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

తాజా వరద పరిస్థితులు, వర్షాలు కొనసాగుతాయనే హెచ్చరికలతో సర్వత్రా ఆందోళన

2లో


# ఫోర్త్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

**ఫ్యూచర్ సిటీలో భాగస్వాములను చేస్తాం.. కొందరు జర్నలిస్టుల తీరుతో అందరికీ చెడ్డపేరు**

**పేట్‌బషీర్‌బాగ్‌లో కేటాయించిన 38 ఎకరాల భూమి జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: త్వరలో నిర్మించనున్న ఫోర్త్‌సిటీలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లస్థలాలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇండ్ల స్థలాల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని కోరారు. అర్హులైన వారిని ఫ్యూచర్‌సిటీలో భాగస్వాములను చేస్తామని చెప్పారు. ఆదివారం ఆయన రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జేహెచ్‌ఎస్)కు భూమి స్వాధీన పత్రాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొ న్నం ప్రభాకర్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భం గా సీఎం మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి చికిత్స చేసే డాక్టర్లు అనే భావనతో వారి సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఇండ్ల స్థలాలు కేటాయించారని గుర్తుచేస్తూ.. ఇప్పుడు ఆ స్థలాలను తమ చేతుల మీదుగా అందజేయడం సంతోషంగా ఉన్నదని చెప్పారు.

2లో



## రేపు సీఎంతో 16వ ఆర్థిక సంఘం భేటీ

డిప్యూటీ సీఎం భట్టితో కలిసి చర్చల్లో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి

రాష్ట్రానికి కేంద్ర నిధుల పంపిణీపై కీలక సూచనలు చేసే అవకాశం

నేడు స్థానికసంస్థల ప్రతినిధులు, వ్యాపార, రాజకీయ పార్టీలతో సమావేశం



# విపత్తుపై యుద్ధం!

విజయవాడ అంటే.. మండే ఎండలు,

ఉక్కపోత! భారీ వర్షం పడితే..

బుడమేరు ముంపు.. కృష్ణా వరద..

భారీ వర్షాలు.. ఒకే సమయంలో ముప్పేట దాడి

సవాలును స్వీకరించిన రాష్ట్ర సర్కారు

2లో



## దేశాభివృద్ధిలో పార్శీలది కీలక పాత్ర: అమిత్ షా

ముంబై: దేశాభివృద్ధిలో పార్శీల సహకారం అపారమైనదని హెూం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ప్రయాణంలో గుజరాతీ వార్తా పత్రిక 'ముంబై సమాచార్'పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. 'ముంబై సమాచార్%-%200 నాటౌట్'డాక్యుమెంటరీ విడుదల సందర్భంగా ఆదివారం ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ఈ డాక్యుమెంటరీ ఏకకాలంలో 40 దేశాల్లో విడుదలైంది.



2లో

## రాకాసి తండాకు అండగా ఉంటాం

**తండాను చూసి రమ్మని ప్రధాని చెప్పారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**ముంపునకు గురైన పంట పొలాలు, ఇళ్లు పరిశీలన**

తిరుమలాయపాలెం: ఆకేరు వరద బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉంటాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సర్వం కోల్పోవడంతో ఇక్కడ ఉండలేమంటున్న ప్రజల ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో ప్రాంతంలో ఆవాసాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాడైన భూములు మళ్లీ సాగులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆకేరు వరదతో



## హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్

**ఏసీబీ ఏడీజీగా విజయ్‌కుమార్**

**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కొత్తకోట**

**సీనియర్ ఐపీఎస్‌ల బదిలీ**

హైదరాబాద్: కాంగ్రెస్ సరారు వచ్చాక రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు భారీగా జరుగుతున్నాయి. తాజాగా వినాయకచవితి

# రైతుల పట్ల యమపాశం

ప్రభుత్వంపై హరీశ్ ధ్వజం

కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ నిబంధనతో రైతు సురేందర్ రెడ్డి ఆత్మహత్య

రుణమాఫీని ఎగ్గొట్టడానికే 31 సాకులు



2లో

హైదరాబాద్: కాంగ్రెస్ తొమ్మిది నెలల పాలన అన్నదాతల పట్ల యమపాశంగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ నయవంచనతో రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ అని తెలిసి సురేందర్ రెడ్డి మేడ్చల్‌లో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు లేఖ రాసి పెట్టి మరీ ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. రైతు రుణమాఫీ ఆంక్షలతో రేవంత్ కుటుంబ బంధాల్లో కూడా చిచ్చుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సురేందర్‌కు ఏపీజీవీపీ బ్యాంకులో

# రేపు సీఎంతో 16వ ఆర్థిక సంఘం భేటీ

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్ర పర్యటనలో భాగంగా 16వ ఆర్థిక సంఘం బృందం ఆదివారంహైదరాబాద్ చేరుకుంది. చైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలోని ఈ బృందంలో అజయ్ నారాయణ్ ఝా, యానీ జార్జి మ్యాథ్యూ, మనోజ్ పాండా, డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ సభ్యులుగా ఉన్నారు. సోమవారం ఉదయం ప్రజాభవన్‌లో పట్టణ స్థానికసంస్థల ప్రతినిధులు, గ్రామీణ స్థానికసంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్/సభ్యులు, అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించనుంది. ఆ తర్వాత వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంఘాలు, సంస్థలతోపాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో విడివిడిగా సమావేశం కానుంది. రాత్రి 8 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఈ బృందానికి విందు ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రజాభవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో ఆర్థిక సంఘం బృందం సమావేశం కానుంది. రాష్ట్రం నుంచి కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తున్న ఆదాయంతో పోలిస్తే రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న కేటాయింపులు తక్కువగా ఉంటున్నందున వాటిని పెంచేలా కేంద్రానికి నివేదించాలంటూ 16వ ఆర్థిక సంఘానికి సీఎం విజ్ఞప్తి చేసే అవకాశం ఉంది. అభివృద్ధిలో పురోగమిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు నిధుల కేటాయింపులు పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత వృద్ధి చెందుతుందని.. తద్వారా కేంద్ర, రాష్ట్రాలకు ఆదాయం పెరుగుతుందని ఆయన సూచించనున్నట్లు తెలిసింది.

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంతోపాటు 16వ ఆర్థిక సంఘం నుంచి ఆశిస్తున్న సహకారంపై ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, పురపాలక శాఖలు ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నాయి. అనంతరం ప్రజాభవన్‌లో అరవింద్ పనగరియా బృందానికి భట్టి విక్రమార్క విందు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు అరవింద్ పనగరియా బృందం మీడియా సమావేశంలో తమ పర్యటన వివరాలను వెల్లడించనుంది. 11న ఉదయం 16వ ఆర్థిక సంఘం తిరిగి వెళ్లిపోనుంది. 2025%-%26 నుంచి 2030%-%31 మధ్య కేంద్రం, రాష్ట్రాల మధ్య జరగాల్సిన నిధుల పంపకాల విషయంలో 16వ ఆర్థిక సంఘం చేయనున్న సిఫారసులు కీలకం కానున్నాయి. 2025 అక్టోబర్ 31 నాటికి నివేదిక సమర్పించాల్సి ఉండగా 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది. రాష్ట్రాల ఆర్థిక వనరులను అంచనా వేసి ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా ఉన్న పంచాయతీలు, మున్సిపాలిటీలకు అదనపు నిధులను సమకూర్చడానికి తీసుకోవాల్సిన చర్యలనూ సిఫారసు చేయనుంది.

**పీహెచ్‌సీని సందర్శించనున్న 16వ ఆర్థిక సంఘం**

16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ్ ఝా మంగళవారం మధ్యాహ్నం ప్రజాభవన్‌లో పురపాలక శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. 15వ ఆర్థిక సంఘం కింద జీహెచ్‌ఎంసీకి మంజూరైన నిధుల వినియోగంపై సంస్థ అధికారులు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ఆయన మధ్యాహ్నం 3 గంటలకు యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని అనంతారం గ్రామాన్ని సందర్శించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పనితీరును, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య రంగానికి కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగాన్ని పరిశీలించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు.

# విపత్తుపై యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: ఒకవైపు భారీ వర్షాలతో నగరంలో విరిగి పడిన కొండ చరియలు! మరోవైపు... ప్రధాన రహదారులను ముంచెత్తిన నీరు! గత శనివారం బెజవాడలో ఇదీ పరిస్థితి! అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించి దిద్దుబాటు చర్యలు చేపడుతుండగానే... పులిమీద పుట్రలా గత ఆదివారం బుడమేరు ముంచెత్తింది. తొలిసారి విజయవాడ ఉత్తర భాగం వారం రోజులుగా వరద నీటిలో ఉంది. అనుకోని ఉపద్రవం, అందుకోలేనంత ముంపులో జనంతో తొలి రెండురోజులు మాత్రం సహాయ చర్యల్లో తడబాటు కనిపించింది. మూడో రోజు నుంచి మెల్లగా మార్పు మొదలైంది. సవాళ్ల మధ్య రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. సీఎం చంద్రబాబుతోపాటు రాష్ట్ర సచివాలయం మొత్తం విజయవాడ కలెక్టరేట్‌కు తరలి వచ్చింది. దాదాపు 15 మంది మంత్రులు, పదుల సంఖ్యలో అఖిలభారత సర్వీసు అధికారులు రంగంలోకి దిగారు. 'చివరి బాధితుడిని సైతం ఆదుకోవాలి' అనే లక్ష్యం పెట్టుకున్నారు. సీఎం, మంత్రులు, అధికారులు మొదటి 72 గంటలు కంటిమీద కునుకు వేయకుండా వరద ప్రభావిత ప్రాంతాలను అంటిపెట్టుకుని పని చేశారు. ముందుగా ఆ ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, నీటిని అందించేందుకు సమీపంలో ఉన్న పవర్ బోట్లు తెప్పించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దించారు. ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు కూడా ప్రభుత్వం అందించింది. ఇలా...తొలి అడుగులోనే ప్రజల్లో ధైర్యం, భరోసా కల్పించడంలో విజయవంతమైంది. గతంలో ముఖ్యమంత్రిగా పని చేసిన 14 ఏళ్ల కాలంలో చంద్రబాబు చూసిన అతి పెద్ద విపత్తు హుద్‌హుద్ తుఫాను! అప్పుడు ఆయన పదిరోజులు విశాఖలోనే ఉండి... పరిస్థితి మొత్తం చక్కబడ్డాకే వెనుదిరిగారు. ఇప్పుడు విజయవాడలో అంతకుమించిన ముప్పు తలెత్తింది. హుద్‌హుద్ తుఫాను విశాఖ మొత్తాన్ని అతలాకుతలం చేసింది. పెనుగాలులకు విశాఖలో కరెంటు స్తంభాలు కుప్పకూలాయి. అప్పుడు వరద లేదు, నీరు నిల్వలేదు! విద్యుత్ స్తంభాలు, కూలిన చెట్లను తొలగించగానే సగం సమస్య తీరింది. కానీ... విజయవాడలో పరిస్థితి పూర్తి భిన్నం! బాధితుల వద్దకు వెళ్దామంటే పీకల్లోతు వరద నీరు! ఎడతెరిపి లేని వర్షం! ఉప్పొంగుతున్న కృష్ణా నది! అటు... బుడమేరుకు భారీ గండ్లు. ఒకేసారి ఇన్ని సవాళ్లు... ఇన్ని కష్టాలు! అయినా... చంద్రబాబు



అదరలేదు, బెదరలేదు! సవాలుగా తీసుకుని, సహాయ చర్యలు చేపట్టారు.

**అటు ప్రకాశం బ్యారేజీపై..**

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో రికార్డు స్థాయి వరద ప్రవహిస్తున్న సమయంలోనే పెద్దబోట్లు గేట్లను ఢీకొట్టడం తీవ్ర ఆందోళనకు కారణమైంది. దీంతో... గేట్లకు సంబంధించిన కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. ఈ సవాలును కూడా ప్రభుత్వం దీటుగా ఎదుర్కొంది. అప్పటికప్పుడు కొత్త కౌంటర్ వెయిట్లను అమర్చే పనులు మొదలుపెట్టారు. ఆదివారానికి ఈ పనులూ కొలిక్కి వచ్చాయి. సోమవారం బోట్ల తొలగింపు ప్రక్రియ మొదలుకానుంది.

**కేంద్రం సత్వర స్పందన**

విజయవాడలో ఉన్న పరిస్థితిని సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కేంద్రానికి వివరిస్తూ వచ్చారు. నేరుగా ప్రధాని దృష్టికే తీసుకెళ్లారు. దీంతో కేంద్రం కూడా తక్షణం స్పందించింది. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేక బృందంతో విజయవాడకు వచ్చారు. కేంద్ర మంత్రితో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయి, వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు. బుడమేరు గండ్లు పూడ్చడానికి సైన్యం రంగంలోకి దిగిందంటే కారణం... కేంద్రం సత్వర స్పందనే! టెక్నాలజీ అంటే చంద్రబాబు... చంద్రబాబు అంటే టెక్నాలజీ అనేది మరోసారి నిరూపితం అయింది. వరద సహాయ చర్యల్లో టెక్నాలజీని ఉపయోగించుకున్నారు.



# హైదరాబాద్ సీపీగా సీవీ ఆనంద్

రోజున ఐదుగురు ఐపీఎస్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సీవీ ఆనంద్‌ను నియమించగా, మొన్నటి వరకూ సీపీగా కొనసాగిన కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు పర్సనల్ ఏడీజీగా ఉన్న విజయ్ కుమార్‌ను ఏసీబీ ఏడీజీగా, ఆయన స్థానంలో లా అండ్ ఆర్డర్ ఏడీజీ మహేశ్ భగవత్‌ను నియమించింది. ఇక పోలీస్ స్పోర్ట్స్ ఐజీగా ఎం రమేశ్‌కు సైతం అదనపు బాధ్యతలు అప్పగించింది. అయితే, ఇటీవల హైదరాబాద్‌లో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపు తప్పడం, అడ్డూ అదుపులేకుండా నేరాలు పెరిగిపోతుండటం, పోలీసులే లంచాల్లో మునిగి తేలుతుండగా.. సీపీ ట్రాన్స్‌ఫర్లు మాత్రమే చేస్తుండేవారు. నేరాల అదుపులో పురోగతి లేకపోవడంతో సీవీ ఆనంద్‌ను మళ్లీ హైదరాబాద్ సీపీగా తీసుకొచ్చినట్టు సమాచారం. దీంతోపాటు సమర్థుడైన అధికారిగా పేరున్న జయ్‌కుమార్‌ను పోలీసు పర్సనల్ అదనపు డీజీగా ఉంచడం.. పోలీసు వర్గాల్లో కూడా వ్యతిరేకత వ్యక్తమవడంతో అతన్ని అవినీతి నిరోధకశాఖ అదనపు డీజీగా నియమించినట్టు తెలిసింది.

# మళ్లీ 'మున్నేరు' ముంపు!

(మొదటి పేజీ తరువాయి)

మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజలను ముంపు భయం వెంటాడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు తోడు ఖమ్మం జిల్లాలోనూ శనివారం నుంచి వర్షం కురుస్తుండడం, వర్షాలు మరో రెండురోజుల పాటు కొనసాగే అవకాశం ఉందనే వాతావరణ శాఖ సూచనలతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆకేరు, మున్నేరుల్లో పెరుగుతూ తగ్గుతున్న వరద కలవరపరుస్తోంది. కనీవిని ఎరుగని కుండపోత నేపథ్యంలో ఈనెల 1న మున్నేరు, ఆకేరు ఉప్పొంగి ప్రవహించిన సంగతి తెలిసిందే. అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద ప్రధానంగా ఖమ్మం నగరంలోని 50 కాలనీలు, ఖమ్మం రూరల్ మండలంలోని 20 కాలనీలను ముంచెత్తి వేలాది మందిని నిరాశ్రయులను చేసింది. కట్టుబట్టలతో మిగిలిన బాధితులకు వరద పరిస్థితులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. శనివారం సాయంత్రం 8.25 అడుగులుగా ఉన్న మున్నేరు నీటిమట్టం అంతకంతకు పెరుగుతూ అర్ధరాత్రి 12 గంటలకు 14.80 అడుగులుగా నమోదైంది. ఆదివారం 15.75 అడుగులకు చేరుకుని తర్వాత కాస్త తగ్గుముఖం పట్టింది. ఈ నేపథ్యంలోనే అధికారులు అప్రమత్తమయ్యారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, ఈనెల 1నాటి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా శనివారం రాత్రి నుంచే ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. బాధితులు కూడా ఇటీవలి భయానక పరిస్థితిని తలుచుకుంటూ బెంబేలెత్తిపోతున్నారు.

**అక్కడ భారీ వర్షం.. ఇక్కడ భయం**

ఖమ్మం జిల్లాకు ఎగువన మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. అక్కడ ఏ ప్రాంతంలో భారీ వర్షం పడినా ఆకేరు, మున్నేరు పరీవాహక ప్రాంతాలకు వరద పోటెత్తుతుంది. ఆ విధంగానే ఈ నెల 1న భారీయెత్తున వరద ముంచెత్తింది. ఖమ్మం జిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో విధ్వంసం సృష్టించింది. వందలాది ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇళ్లలో ఉన్న నిత్యావసరాలు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు కూడా కొట్టుకుపోయాయి. మున్నేరు పరీవాహక ప్రాంతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 16 మండలాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మండలాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్‌లో భారీ వర్షాలు కురిస్తే ఖమ్మం జిల్లాలోని 11 మండలాలు వరద తాకిడికి గురవుతున్నాయి. ఇక ఆకేరు పరీవాహకంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 మండలాలు, ఖమ్మం జిల్లాలో రెండు మండలాలు ఉంటాయి. ఆకేరు వరద మున్నేరులోకి చేరుతుండటంతో మున్నేరు ఉధృతి మరింత తీవ్రమై ఖమ్మంలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతోంది. ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్లుగా ఆకేరు, మున్నేరు పరీవాహక ప్రాంతాల్లోని మండలాల్లో గత పది రోజులుగా అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. మహబూబాబాద్ జిల్లాలో గత నెల 31న, ఈనెల 1న పలు ప్రాంతాల్లో 40.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే ఖమ్మం జిల్లాలోనూ ఈ రెండు రోజుల్లో సగటు వర్షపాతం అన్ని మండలాల్లో కలిపి 20 సెం.మీ. పైగా నమోదు కావడం గమనార్హం. ఈ స్థాయి వర్షం ఈ రెండు ఏర్ల పరీవాహక ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేదని అధికారులు చెబుతున్నారు. రికార్డు స్థాయి వర్షాల నేపథ్యంలోనే వరద ఉప్పెనలా పోటెత్తి లోతట్టు ప్రాంతాల్లో తీవ్ర నష్టాన్ని కలిగించింది. ఈ రెండు వాగుల వేగ ఉధృతి కూడా గతంతో పోలిస్తే పెరిగిందని నిపుణులు చెబుతున్నారు. ఈ కారణంగానే ఎన్ని గంటల్లో లోతట్టు ప్రాంతాలకు వరద చేరుతుందో అధికారులు కూడా అంచనా వేయలేకపోతున్నారు.



# ఫోర్త్‌సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన మిగిలిన జ ర్నలిస్టులకు కూడా ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన నిర్ణయం తీసుకోవడానికి ప్రభుత్వానికి ఎలాంటి శశభిషలూ లేవని తెలిపారు.

**వృత్తిపరమైన గౌరవాన్ని మనమే పెంచుకోవాలి**

వృత్తిపరమైన గౌరవాన్ని ఎవరూ పెంచరని, తమ కు తామే పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్బోధించారు. కొందరు చేసే పనులతో జర్నలిస్టులందరికీ చెడ్డపేరు వస్తున్నదని, అలాంటి వారిని నియంత్రించే బాధ్యత జర్నలిస్టులపైనే ఉన్నదని వ్యాఖ్యానించారు.

**మీడియా అకాడమీకి 10 కోట్లు**

ఆరోగ్య భద్రత కార్డులు, అక్రిడిటేషన్, ఇతర సమస్యలకు శాశ్వత పరిషారం చూపేందుకు మీడియా అకాడమీ కొత్త విధివిధానాలను రూపొందించాలని సీఎం సూచించారు. మీడియా అకాడమీకి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి రూ.10 కోట్లు ఇస్తున్న ట్టు సీఎం ప్రకటించారు. ఫోర్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో భాగస్వాములమవుదామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చనిపోయి న 41 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున చెకును సీఎం అం దజేశారు. అనంతరం జేఎన్‌జేహెచ్‌ఎస్‌కు పేట్‌బషీర్‌బాగ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కేటాయించిన 38 ఎకరాల భూమి స్వాధీనపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో పార్శీలది కీలక పాత్ర: అమిత్ షా

200 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ముంబై సమాచార్ ఆసియాలోనే అత్యంత పురాతన వార్తా పత్రికగా నిలిచింది. విశ్వసనీయత కలిగిన జర్నలిజానికి 'కామా'కుటుంబం మారుపేరుగా నిలిచిందని అమిత్ షా కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర, నిష్పాక్షిక రిపోర్టింగ్ పత్రిక నిబద్ధతకు, శాశ్వత విజయాలకు రహస్యాలని పేర్కొన్నారు. అందులో వచ్చే ప్రతి వార్తా నిజమేనని జనం నమ్మేవారన్నారు.

# రైతుల పట్ల యమపాశం

(మొదటి పేజీ తరువాయి)

రూ.1.92 లక్షల అప్పు ఉందని, వాళ్ల అమ్మకు రూ.1.15 లక్షల అప్పు ఉండటంతో బ్యాంకు మేనేజర్ కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ అని చెప్పడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడని వివరించారు. రుణమాఫీకి రేషన్ కార్డు లింకు లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పారని, సురేందర్ ఆత్మహత్యతో సీఎం చెప్పిన మాటలు తప్పని తేలాయన్నారు. రేవంత్ పాలనకు సురేందర్ రెడ్డి లేఖ పంచనామా లాంటిదని చెప్పారు. కేసీఆర్ కుటుంబ బంధాలను బలోపేతం చేస్తే వాటిని రేవంత్ ప్రభుత్వం విచ్ఛిన్నం చేసిందని హరీశ్‌రావు మండిపడ్డారు. తన నియోజకవర్గంలో జక్కాపూర్ గ్రామంలో గురజాల బాల్‌రెడ్డి కుటుంబంలో ముగ్గురికి రుణం ఉందని, వారికి ఆరు లక్షల అప్పు ఉంటే కేవలం రెండు లక్షలే మాఫీ అవుతోందని చెప్పారు. ఇలాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయన్నారు. రుణ మాఫీ ఎగ్గొట్టడానికి రేవంత్ ప్రభుత్వం 31 సాకులు చూపెడుతోందన్నారు. కుంభాల సిద్ధారెడ్డి, చాట్ల హరీష్ అనే రైతులకు భార్యల ఆధార్ కార్డులు తెమ్మంటున్నారని, వారికి పెళ్లే కానప్పుడు భార్యల ఆధార్ కార్డులు ఎక్కడ్నుంచి తెస్తారని ప్రశ్నించారు. 20 లక్షల మందికే ఇప్పటిదాకా రుణ మాఫీ అయిందని, ఇంకా 21 లక్షల రైతులకు మాఫీ కావాల్సి ఉందన్నారు. ఇప్పటిదాకా 470 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. కేసీఆర్ పదకొండు విడతలుగా రైతు బంధు ఇచ్చారని, యాసంగి పంట వేసే టైం వస్తున్నా... వానా కాలం రైతు బంధు ఇవ్వరా? అని ప్రశ్నించారు. వడ్లకు బోనస్ బోగస్‌గా మారిందని ఎద్దేవా చేశారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతుల కోసం బీఆర్ఎస్ ప్రాణాలకు తెగించి పోరాడుతోందన్నారు. సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాకాసి తండాకు అండగా ఉంటాం

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో జరిగిన నష్టం ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి వచ్చిందని తెలిపారు. స్వయంగా తండాను చూసి రావాల్సిందిగా ప్రధాని తనకు చెప్పారని వెల్లడించారు. ఆదివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డితో కలిసి కిషన్‌రెడ్డి రాకాసి తండాను సందర్శించారు. ముంపునకు గురైన పంటపొలాలు, కొట్టుకుపోయిన ఇళ్లను పరిశీలించారు. తండా వాసులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకున్నారు. ఆకేరుపై నిర్మించిన సీతారామ ప్రాజెక్టు అక్విడక్ట్‌తోనే తమ గ్రామం సర్వనాశనమైందని, పచ్చని పంటపొలాల్లో రాళ్లు, ఇసుక మేటలు వేశాయని స్థానికులు తెలిపారు. ఇక్కడ తాము ఉండే పరిస్థితి లేనందున మరోచోట స్థలాలు ఇచ్చి, ఇళ్లు కట్టించి ఆదుకోవాలని వేడుకున్నారు. ఇళ్లు, ఆస్తులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన తమకు దిక్కెవరంటూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సమకూర్చిన గ్యాస్ స్టౌలు, రగ్గులను కిషన్‌రెడ్డి వారికి అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనేక జిల్లాలు జలమయమైనందున జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. రాకాసి తండాలో జరిగిన నష్టాన్ని ఆయన కేంద్రమంత్రికి వివరించారు. కేంద్రమంత్రులు ముంపు ప్రాంతాల్లో పర్యటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాల్సిందిగా ఇప్పటికే కిషన్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు.





# వీధి దీపాలు ఎక్కడ?

**గ్రామంలో ఎక్కడ వెలగని విధి దీపాలు**

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :** వర్తమన్నూర్ గ్రామంలో ఎక్కడ చూసినా వీధి దీపాలు వెలగటం లేదు గ్రామస్తులు ఎన్నిసార్లు అధికారులు చెప్పిన చెవి చివన పెడుతున్నారు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అదేవిధంగా ప్రజలు బయటకు వెళ్లంటే భయాందోళనకు గురవుతున్నారు వర్షకాలం వుండటంతో ఎక్కడికి వెలలేని పరిస్థితి పాములు తేళ్ళు రోడ్లపై వీరంగం చేస్తుంటే అధికారులు మాత్రం పటించకోవటం లేదు ప్రస్తుతం గణేష్ ఉత్సవాలు ఉన్న ఎక్కడ కూడా విధి దీపాలు వెళగటం లేదు ఇకనైనా అధికారులు చొరవ తీసుకుని విధి దీపాలు వుండేలా చూడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి జన్మదిన వేడుకలు



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 08: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, రామంతపూర్ మున్సిపల్ కౌన్సిలర్ అశోక్, న్యాయవాది వెంకటేశం, నాయకులు బద్దం కృష్ణారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జొన్నాడ జగన్ గౌడ్, లక్ష్మారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పి విష్ణువర్ధన్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.





## గణేష్ నగర్ గణనాథునికి ప్రత్యేక పూజలు చేసిన రెండో వార్డు కౌన్సిలర్ బిసోల్ల సంధ్యారాణి అశోక్ కుమార్


**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 08 : (డైలీ రిపోర్ట్):** లంబోదరని ఆశీస్సులు పట్టణ ప్రజలపై ఉండాలని రెండవ వార్డు కౌన్సిలర్ బిసోల్ల సంధ్యారాణి అశోక్ కుమార్ అన్నారు. మొదటి రోజు గణనాథునికి ఆమె ప్రత్యేక పూజలు చేసి, స్వామివారి ఆవాహన మండపారాధన, అంగపూజ అష్టోత్తరాలతో నిర్వహించి, స్వామివారికి మహా మంగళ నిరాజనాలు అర్పించడంతో పాటు మహా నైవేద్యాన్ని నివేదించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అందరూ సంతోషంగా పండగ జరుపు కోవాలని, ప్రతి ఒక్కరికి విఘ్నేశ్వరుడైన ఆ మహాదేవుడి అనుగ్రహం పొందాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామిని కోరుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు, చైతన్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.



### ఘనంగా ప్రారంభం అయిన

## వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

**సంగారెడ్డి డైలీ రిపోర్ట్ బ్యూరో :** సంగారెడ్డి పట్టణం సరస్వతి నగర్ లో జయం యువసేన ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సాహలు ఘనంగా ప్రారంభం అయినవి ఇట్టి కార్యక్రమం లో కాలనీ పెద్దలు కోడిదే లింగమ్మ యాదగిరి చేత వినాయకునికి పూజలు చేయగా అర్చకులు మీనా నాథ్ శర్మ వినాయక చవితి పూజ కార్యక్రమన్ని వేదం మంత్రాలతో చేసి తీర్ద ప్రసాదాలు భక్తులకు వితరణ చేశారు. అనంతరం మహిళలు యువత కోలాటం అడి సాంస్కృతిక వైభవం చాటారు. ఇట్టి కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ వ్యవస్థపాక సభ్యులు శ్రీధర్ మహేంద్ర, బాబన్న,తాంద్ర రాజు, కోట సత్యనారాయణ, జయం యువసేన సభ్యులు ప్రమోద్ కుమార్,సుభాష్, సుమన్, సాయి %ఎబఖ్తీ%చావన్ పవన్, కిట్టు, కసిని పవన్, సాయి కృష్ణ, సాయి కిరణ్, మనీల్, హన్మంత్, శ్రీకాంత్, రాములు మహేష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు






## గెలిపించిన రైతులనే మోసం చేస్తారా?: జగదీష్‌రెడ్డి

సూర్యాపేటజిల్లా: రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గందరగోళంలోకి నెట్టిందని, కరెంట్ విషయంలో పాత రోజులు గుర్తుకు వస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత జగదీష్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేటలో ఆదివారం(సెప్టెంబర్8) ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ మంత్రులు సంపాదనలో మునిగిపోయారు. రైతులు మిమ్మల్ని గెలిపిస్తే అదే రైతులను మోసం చేసి పబ్బం గడుపుతున్నారు. రూ.2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తారా లేదా స్పష్టమైన వైఖరి తెలియజేయాలి. వరద బాధితులకు వెంటనే నష్ట పరిహారం అందించాలి'అని డిమాండ్ చేశారు



## పిసిసి అధ్యక్షుడిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే: కాలే యాదయ్య

**శంకర్పల్లి సెప్టెంబర్ 08:(డైలీ రిపోర్ట్) :** పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని ఆదివారం ఆయన నివాసంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర నూతన పిసిసి చీఫ్ సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

## పిసిసి అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ బరత్



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 08: (డైలీ రిపోర్ట్):** పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని ఆదివారం ఆయన నివాసంలో రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్ మర్యాదపూర్వకంగా కలిసి బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర నూతన పిసిసి చీఫ్ సారధ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ నాయకుడు మహేష్ కుమార్ గౌడ్ అని, కష్టపడ్డ కార్యకర్తకు తగిన ప్రాధాన్యత దక్కిందని ఆమె కొనియాడారు. పిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానని, పార్టీలో కష్టపడే వారికి ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## టీచర్లు తలుచుకుంటే సర్కార్ తలరాతలు మారిపోతాయి: బండి సంజయ్



కరీంనగర్: తెలంగాణలో ఉద్యోగులకు నెల మొదటి వారంలో జీతాలు పడటం బీజేపీ పోరాట ఫలితమేనని అన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్. అలాగే, రాష్ట్రంలో టీచర్లు తలుచుకుంటే సర్కార్ తలరాతలే మారిపోతాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు టీచర్లకు ఏం మంచి జరిగిందని ప్రశ్నించారు. కాగా, కరీంనగర్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువందనంలో పాల్గొని ఉత్తమ టీచర్లను ?కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ..'రాష్ట్రంలో టీచర్లు అందరూ రోడ్లపైకి వచ్చి కొట్లాడండి. విద్యార్థుల సమస్యలపై గళం విప్పండి. టీచర్లు తలుచుకుంటే సర్కార్ తలరాతలు మారిపోతాయి. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్దంగా పోరాడే వాళ్లకు నేను సంపూర్ణంగా మద్దతు ఇస్తాను. కాంగ్రెస్ పార్టీకి ఓట్లేస్తే టీచర్లకు ఏం మంచి జరిగింది?. మీ కోసం మేం పోరాడి జైలుకు వెళితే కాంగ్రెస్‌ను గెలిపించడం ఎంతవరకు సమంజసం?. ఉద్యోగులకు మొదటి వారం జీతం బీజేపీ పోరాట ఫలితమే. 317 జీవోతో టీచర్లు అల్లాడితే ఉపాధ్యాయ సంఘాల ఎందుకు నోరు విప్పలేదు?. టీచర్ల పక్షాన కొట్లాడి జైలుకు వెళ్లిన ఏకైక సంఘం తపస్ మాత్రమే. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏవీఎన్ రెడ్డికి జోడీని గెలిపించండి. బీఈడీ అర్హతలున్న ఎస్జీటీ టీచర్లకు ప్రమోషన్లను న్యాయం జరిగేలా కృషి చేస్తాను. పాఠ్యాంశాల్లో నక్సలైట్ల సిద్దాంతాలను, కమ్యూనిస్టు మూలాలను చొప్పించే కుట్ర జరుగుతోంది. సమాజాన్ని భ్రష్టు పట్టించే కుట్రలను ఛేదించాలి' అంటూ కామెంట్స్ చేశారు.



# 20 ఏళ్ల కల.. కొత్త వ్యాపార రంగంలో అడుగుపెట్టిన హనీరోజ్

'వీరసింహారెడ్డి' సినిమాతో టాలీవుడ్‌లో బాగా పాపులర్ అయిన కేరళ ముద్దుగుమ్మ హనీరోజ్ . ఆ సినిమా తర్వాత మరో ప్రాజెక్ట్‌లో కనిపించకపోయినా రోజూ సోషల్‌మీడియాలో సందడి చేస్తూనే ఉంటుంది. తన గ్లామర్ ఫోటోలతో పాటు లెక్కలేనన్ని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవాల్లో పాల్గొంటూ అభిమానులకు దగ్గరగానే ఉంటుంది. సినిమాలు చేయకపోయిన స్టార్ హీరోయిన్‌లకు మించిన పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు సినిమాల్లో నటించిన హనీరోజ్.. త్వరలో నిర్మాతగా మారనుంది. 'హనీ రోజ్ వర్గీస్ ప్రొడక్షన్స్' పేరుతో నిర్మాణ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని తాజాగా తన సోషల్‌మీడియా ద్వారా తెలిపింది. ఈ క్రమంలో తన సంస్థ లోగోను కూడా పంచుకుంది. 'హనీ రోజ్ వర్గీస్ ప్రొడక్షన్స్' లోగో పోస్టర్‌తో పాటు హనీరోజ్ ఇలా చెప్పుకొచ్చింది. ' సినిమా అనేది చాలా మందికి ఒక కల, ఒక విజన్, ఒక వెంచర్. అదొక ఫాంటసీ. అదొక జీవిత కోరిక. దాదాపు 20 ఏళ్లుగా సినిమాల్లో నును భాగం అయ్యాను. దీనిని నేను ఓ వరంలా భావిస్తున్నాను. నా యవ్వనం, జీవితం, చదువు, స్నేహం ఇలా అన్నింటిలో సినిమానే పెద్ద పాత్ర పోషించింది. కాబట్టి ఈ పరిశ్రమలో పెద్ద పాత్ర పోషించడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. నా పుట్టినరోజు సందర్భంగా గర్వంగా నా కొత్త వెంచర్ లోగోను లాంచ్ చేస్తున్నాను. 'హనీ రోజ్ వర్గీస్ ప్రొడక్షన్స్'. సినీ ప్రేమికుల నుంచి నాకు లభించిన ప్రేమే నాకు గొప్ప పాత్రలు వచ్చేలా చేసింది. నాపై మీరు చూపించిన ప్రేమ ఎప్పటికీ కొనసాగుతుందని ఆశిస్తున్నాను. నా ప్రయాణంలో నాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్తున్నా.' అని తెలిపింది. %న=ు% ప్రొడక్షన్స్ ద్వారా నా కోరిక, ఆశ నెరవేరుతుందని భావిస్తున్నాను. టాలెంట్ ఉండి ఛాన్స్‌ల కోసం ఎదురుచూస్తున్న ప్రతిభావంతులకు ఇదొక వారధిలా నిలబడుతుంది. మా ప్రొడక్షన్ ద్వారా వచ్చే సినిమాలు ఇండస్ట్రీ కీర్తిని తీసుకొచ్చేలా ఉంటాయి. ఈ క్రమంలో అద్భుతమైన కథలను చెప్పాలనుకుంటున్నాము.' అని హనీ రోజ్ పేర్కొన్నారు.



# ఉద్వేగాల వసంత

మెగా హీరో సాయిదుర్గతేజ్ కథానాయకుడిగా రోహిత్ కెపి దర్శకత్వంలో ఓ ప్రతిష్టాత్మక పానిండియా సినిమా తెరకెక్కుతున్నది. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర పేరు వసంత. కథలో చాలా కీలకమైన కేరక్టర్ అది.ఐశ్వర్యలక్ష్మి ఈ పాత్రను పోషిస్తున్నది. శుక్రవారం ఆమె పుట్టినరోజు. ఈ సందర్భంగా వసంతగా ఆమె కేరక్టర్‌ని పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఐశ్వర్యలక్ష్మి లుక్ భావోద్వేగపూరితంగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో వేసి భారీ సెట్‌లో ఈ సినిమాకు సంబంధించిన చిత్రీకరణ జరుగుతున్నది. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సాయిదుర్గతేజ్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే చిరస్థాయిగా నిలిచిపోయే సినిమా అవుతుందని మేకర్స్ చెబుతున్నారు.



# లైంగిక వేధింపులుంటే ఫిర్యాదు చేయండి: నాజర్

నటీమణులపై లైంగిక వేధింపుల వ్యవహారంలో కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హేమా కమిటీ ప్రభావం ఇతర ఇండస్ట్రీల్లోనూ చర్చనీయాంశమైంది. దీంతో దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం) మహిళలపై లైంగిక వేధింపుల వ్యవహారంలో చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. తాజాగా నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ మహిళల రక్షణ కోసం పలు వ్యాఖ్యలు చేశారు. విశాఖ కమిటీ సూచనల మేరకు నటీమణుల కోసం ఎస్ఐఏఏ%-%జీఎస్ఐసీసీ పేరుతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దీనికి నటి రోహిణి అధ్యక్షురాలిగానూ, నటీమణులు సుహాసిని, ఖుష్బూ సభ్యులుగానూ వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీకి ఒక న్యాయవాదిని కూడా నడిగర్ సంఘం నియమించింది. తమిళ చిత్రపరిశ్రమలో విశాఖ కమిటీ వేశామని, ఇప్పటికే కొన్ని సమస్యలను కూడా పరిష్కరించామని నాజర్ తెలిపారు. పరిశ్రమలోని మహిళలకు లైంగిక వేధింపులుంటే తమకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, పరిష్కారాలు చూపుతామని నాజర్ అన్నారు.మహిళలపై లైంగిక వేధింపులు అన్ని రంగాల్లోనూ ఉన్నాయని నాజర్ గుర్తుచేశారు. అయితే, సినిమా ఇండస్ట్రీలోని వ్యక్తుల గురించి మాట్లాడేటప్పుడు మాత్రం చాలా కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. చిత్ర పరిశ్రమకు చెందిన వారు ఎవరైనా సరే.. సమస్యలు ఉంటే తమను సంప్రదించవచ్చని ఆయన అన్నారు. మహిళల రక్షణకు నడిగర్ సంఘం అండగా ఉంటుందని తెలిపారు.

# ఒక సినిమాకు ఇన్ని స్టార్స్ ఇవ్వడం నేనేప్పుడు చూడలేదు: రానా



ఒక మంచి సినిమా వస్తే..దాన్ని మీడియా ఎంత బాగా ప్రమోట్ చేస్తుందో '35-చిన్న కథ కాదు'చిత్రం ద్వారా తెలిసింది. ఈ సినిమాకి మీరు(మీడియా) ఇచ్చినన్ని స్టార్స్ నేను ఎప్పుడూ చూడలేదు .చాలా సంవత్సరాల తర్వాత కిడ్స్, ఫ్యామిలీస్ ని థియేటర్స్ లో హౌస్ ఫుల్ గా చూడటం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు హీరో రానా. నివేద థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ లో నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. సురేష్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమాని రైటర్ డైరెక్టర్. సెప్టెంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా హార్ట్ టచ్చింగ్ ఎమోషన్స్, హెూల్సమ్ ఎంటర్ టైన్ తో అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్యూటీఫుల్ బ్లాక్ బస్టర్ హిట్అందుకుంది. ఈ సందర్భంగా మూవీ టీం థాంక్స్ మీట్ ని నిర్వహించింది. ప్రెస్ మీట్‌లో రానా మాట్లాడుతూ.. 35-చిన్న కథ కాదు' సక్సెస్ చాలా తృప్తిని ఇచ్చింది. నివేద థామస్ అద్భుతంగా నటించింది. పెర్ఫార్మెన్స్ తో ఆశ్చర్యపరిచి తన భుజాలపై సినిమాని ముందుకు తీసుకెళ్ళింది. తనతో వర్క్ చేయడం హానర్ గా ఉంది. సురేష్ ప్రొడక్షన్ పిట్టగోడ ద్వారానే విశ్వదేవ్ లాంచ్ అయ్యాడు. 35లో తన నటన సర్ ప్రైజ్ చేసింది. మంచి కథలు చేయాలనే తపన తనని ఇంకా ముందుకు తీసుకెళుతుంది. సినిమాని ఆదరిస్తున్న ఆడియన్స్ అందరికీ థాంక్ యూ. ఈ సక్సెస్ జర్నీ ఇక్కడ నుంచి స్టార్ట్ అవుతుంది. ఇలాంటి మంచి కథలు ఎప్పుడూ మీ ముందుకు తెస్తూనే ఉంటాం' అన్నారు. నివేదా థామస్ మాట్లాడుతూ.. కిడ్స్, ఫ్యామిలీస్ అందరూ వచ్చి ఇది చిన్న సినిమా కాదని చెప్పడం గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. ఆడియన్స్ అందరికీ థాంక్.



# నాకు మార్షల్ ఆర్ట్స్ బాగా తెలుసు.. నా జోలికొస్తే అంతే: ఆదాశర్మ

మలయాళ ఫిల్మ్ ఇండస్ట్రీలోని కాస్టింగ్ కౌచ్ తీవ్రతపై జస్టిస్ కె.హేమ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ పుణ్యమా అని.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కాస్టింగ్ కౌచ్ అనేది చర్చనీయాంశంగా మారింది. తాజాగా నటి ఆదాశర్మ ఓ ప్రైవేటు ఛానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ కాస్టింగ్ కౌచ్‌కి సంబంధించిన ప్రశ్న ఆమెకు ఎదురైంది. మీ కెరీర్‌లో మీరెప్పుడైనా కాస్టింగ్ కౌచ్‌ని ఎదుర్కొన్నారా? అని ఆదాను అడగ్గా..'మీకు తెలీని విషయం ఏంటంటే.. నాకు మార్షల్ ఆర్ట్స్ బాగా తెలుసు. నాన్‌చాకు తిప్పడంలో నేను ఎక్స్‌పర్ట్. సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలు చేసేటప్పుడు ఎంత వేగంగా ప్రతిస్పందిస్తానో.. నాతో ఎవరైనా మిస్‌బిహేవ్ చేస్తే అంతే వేగంగా స్పందిస్తా. పక్కవాళ్ల అభిప్రాయాలు అస్సలు తీసుకోను. మనం ఏ రంగంలో ఉన్నా సపోర్ట్, నెట్‌వర్క్ అవసరం. నాకైతే నా ఇండస్ట్రీలో మద్దతిచ్చేవాళ్లు చాలామంది ఉన్నారు. అందుకే.. నా గురించి పూర్తిగా తెలిసిన ఎవరూ నా జోలికి రారు.' అంటూ అందంగా నవ్వేసింది ఆదాశర్మ.

# ఆ యూట్యూబర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన శివ బాలాజీ

చిత్రపరిశ్రమలోని నటీనటులతో పాటు వారి కుటుంబసభ్యులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగతంగా ట్రోల్స్ చేస్తున్నవారిపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. ఈ విషయంలో మా అధ్యక్షులు మంచు విష్ణు పలు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలో తాజాగా నటుడు, 'మా' కోశాధికారి శివ బాలాజీ పోలీసులను ఆశ్రయించారు.సినీ నటీనటులను టార్గెట్ చేస్తూ నిత్యం నెగెటివ్ ట్రోల్స్ చేస్తున్న యూట్యూబర్ విజయ్ చంద్రహాసన్ అనే వ్యక్తిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్‌లో శివ బాలాజీ ఫిర్యాదు చేశారు. చంద్రహాసన్ గత కొంత కాలంగా నటీనటులతో పాటు మంచు విష్ణు, ఆయన నిర్మాణ సంస్థ గురించి తప్పుగా చూపుతూ.. ట్రోల్స్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిత్రపరిశ్రమలో భాగమైన మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు ఉన్న గౌరవాన్ని దెబ్బతీసేలా పలు వీడియోలు క్రియేట్ చేశాడని శివ బాలాజీ పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు యూట్యూబర్‌కు నోటీసులు పంపారు. కొద్దిరోజుల క్రితం సుమారు 18కి పైగా యూట్యూబ్ ఛానళ్లను రద్దు చేస్తున్నట్లు మంచు విష్ణు ప్రకటించిన విషయం తెలిసిందే. యూట్యూబర్స్‌లో మార్పు రాకుంటే వారిపై మరింత కఠనమైన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# దేవర రాకతో వాయిదా.. ఆలియా భట్ మూవీ టీజర్ చూశారా?

బాలీవుడ్ భామ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం జిగ్రా. ఈ సినిమాకు వాసన్ బాలా దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో వేదాంగ్ రైనా కీలక పాత్ర పోషించారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ సినిమాను ధర్మ ప్రొడక్షన్స్, వయాకామ్18 స్టూడియోస్, ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై నిర్మించారు. ఈ మూవీ నిర్మాతల్లో ఆలియా భట్ ఒకరిగా ఉన్నారు. అలియా భట్ తొలిసారిగా 2022లో డార్లింగ్స్ సినిమాతో నిర్మాతగా మారారు. ఆమె తన ప్రొడక్షన్ హౌస్ ఎటర్నల్ సన్‌షైన్ ద్వారా సినిమాలను నిర్మిస్తున్నారు. కాగా.. ఈ చిత్రం అక్టోబర్ 11 దసరాకు విడుదల కానుంది. మొదట ఈ మూవీని ఈనెల 27న రిలీజ్ చేయాలని భావించారు. కానీ జూనియర్ ఎన్టీఆర్ దేవర మూవీ విడుదల ఉండడంతో నిర్మాతలు వాయిదా వేయాలని నిర్ణయించారు. దీంతో విజయదశమికి జిగ్రా థియేటర్లలో సందడి చేయనుంది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707